# కొండ మెట్లు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

ముసురు పట్టింది.

ధర్మం.. ఉద్యోగధర్మం.. తప్పదు కదా!

"చీమాచా! వానలో తడవొద్దు. జలుబు చేస్తుంది.." అనేది అమ్మ. ఆమె మాటంటే లక్ష్యం లేదు—కాగితపు పడవలు—అదే పనిగా తడవటం—జలుబు చేసేది—జ్వరం వచ్చేది—అమ్మ కోప్పడేదికాదు. నాన్నతో చెప్పేదికాదు—చెబితే చర్మం ఒలిచేవాడు...

ఈ నీళ్ళోడుతున్న గొడుగుని తీసుకుని జాగ్రత్త పెట్టుతాడేమో ననుకుంటే ఏడీ వీడు గరుడయ్య, ఎక్కడా కనిపించడే! లైబ్రరీ తీసిపెట్టి వీడెక్కడికి వెళ్ళినట్లబ్బా!

అబ్బ! వణుకు పుట్టుతోంది.

"చీమాచా! స్వెట్టర్ తొడుక్కుని వెళ్ళవాయవా!" ఏనాటి అమ్మ! ఇప్పుడెందుకో జ్ఞాపకం? ఇప్పు డేజ్వరమూరాదు...చిత్రం, అలా చెప్పేవాళ్ళుంటే అన్నీ వస్తాయి...ముసలితనం ప్రవేశించి...

ముసలితనం?

అవును, దేహాన్ని కుర్చీ రోజుకు రోజు మరీ కటువుగా, నిర్దాక్షిణ్యంగా పలకరిస్తోంది...

రిటైరై ఎనిమిదేళ్ళు — ఎనిమిదీ అయిదూ పదమూడు—అంటే అరవైమూడేళ్ళు.

షష్టిపూర్తి—ముసలితనం కాక పడుచుతనమా?

అంత బ్రతుకూ బ్రతికి, వట్టి చేతులో పుట్టిన ఊరు, ఏకాకిగా చేరుకోక తప్పలేదు. కాలేజి లైబ్రరీలో ఈ ఉద్యోగం.. దేవస్థానంవారి దయా, ఏడుకొండలవాడి దయా—

ఉద్యోగం వ్యాపకం — కాదు ధర్మనిర్వహణ — కాదు కర్మచేస్తూ ఉండటం—ఉద్యోగం లేకపోయినా పెన్షన్‌తో గడుస్తుంది.. అంతే.. బొంబాయి మాత్రం చచ్చినా వెళ్ళే అవసరం రాదు... ఎందుకు వస్తుందీ? వాడు చచ్చాడనీ, కొడుక్కాదనీ ఇరవై ఏళ్ళ క్రితమే చెప్పడమైంది.

దేశం, జాతి, మతం, కులం, అన్నీ తప్పాడు.

కడుపున చెడబుట్టాడు ... ముందుగానే దాటుకున్న ఆండాళ్ అదృష్టవంతురాలు... తల్లి చావుకు రాలేకపోయిన దౌర్భాగ్యుడు అమెరికాలోనే అడుక్కుతింటూ ఉండక తిరిగి ఎందుకు వచ్చినట్లు?

"కిచ్చూ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు — కిచ్చూ అమెరికా వెళ్తున్నాడు — టాటాస్‌వాళ్ళ ఎనిమిది వందలిస్తామన్నారు—బొంబాయిలో దిగి ఉద్యోగంలో చేరాడుట—రేపు వస్తాడుట—"అందరికీ చాటింపు వేసి గొప్పలు చెప్పుకుంటే దరిద్రుడు, భ్రష్టుడు, కృతఘ్నుడు, ద్రోహి, తెల్లదొరసానితో వచ్చి, హోటల్‌లో దిగి రాయబారం నడుపుతాడా?—ఛీ! ఛీ!! ఫోరా ఫో—నీ ముఖం చూపించకు—వేంకటేశా!, స్వామీ! నీదయ!!...

మమతలు త్రుంచివేశావు— పరీక్షలు పెట్టావు. ఒకదాని మీద ఒకటి...

ఆండాళ్ పోయినప్పుడు అమెరికా వదలి రాలేక పోయాడు తుచ్ఛుడు.

—విశ్వాసం, తల్లి అన్న విశ్వాసం ఉంటే రాకపోవునా?—వచ్చి బాగుపడకపోవునా?—అప్పటికే ఒళ్ళమ్ముకున్నాడో ఏమో!—కుక్క!—దొరసాని లాప్ డాగ్ (lap-dog) వాడూ మనిషే...

"గరుడయ్యా! గరుడయ్యా!!"

"ఏం సామీ?"

"ఇంతసేపూ ఎక్కడున్నావ్?"

''ఇక్కడే.. నిన్నటి పుస్తకాలు సద్దుతున్నా..''

''నేనొచ్చింది చూళ్ళేదూ?''

''లేదు''

దొంగముండావాడు!

''పేపర్లొచ్చాయా?''

''ఆఁ. టేబిల్ మీద పెట్టినా సామీ''

''హిందూ యిలా తీసుకురా''...

''కొలంబో ప్రతిపాదనలు.. అంగీకరించినట్లు నెహ్రూ ప్రకటన''

ఎందుకీ తాపత్రయం నెహ్రూకి! దెబ్బలు తినడమూ మనమే, సంధికి ప్రాకులాడటమూ మన మేనా!....

'జాన్సన్స్ బేబీ పౌడర్'..

కిచ్చాకీ పిల్లలు ఉంటారు యీపాటికి .... ఆంగ్లోయిండియన్ పిల్లలు!..

రామ! రామ!...

ఏంపేరు పెట్టాడు?— టామ్, డిక్, అండ్ హారీ—హరీ కాదు హారీ! ఏదీ వాడికా మగతనం, వ్యక్తిత్వం ఏదీ?—వ్యక్తిత్వం ఉంటే ఏ ఆర్యసమాజం ద్వారానో దాన్ని హిందువుని చేసి ఏడవక పోవునా?...

ఉత్తరాలొచ్చేయి...

మూడు కేటలాగులూ, ఒక పత్రికా. అమూల్యమైన రహస్యాల్ని మోసే లేఖలకు మల్లే ఎప్పుడూ చేతికే అందిస్తానంటాడు హుసేన్.. ఈ పోస్టుమన్ హుసేన్ ఒక రాబట్. కొయ్యబొమ్మ. చక్కిలిగింతలు లేని రాతిబొమ్మ..

బూబుని పరదాలోంచి బయటికి లాగటం పత్రికని బ్రౌన్‌పేపరు నుంచీ వివస్త్రను చేయ్యటం..

హ హ్హాఁ...హోఁ...లైఫ్

అప్పుడు పదేళ్ళ వయసు.. ఇంకా ఇప్పుడు చూస్తున్నట్లుంది. మేడ మీద కిటికీ నుంచీ. స్నానం చేస్తున్న వివస్త్ర. అదే ఓం ప్రథమం..

'లైఫ్'... అమెరికన్లకి లైఫ్ అంటే కేవలం కుర్రతనం..

అబ్బ! ఎన్ని ఉత్తరాలో!

ఉత్తరాల్ని తాకడంలో ఒక సరదా ఉంది!.. నాకా? నా కెక్కణ్ణుంచీ వస్తుంది ఉత్తరం? ఏమో!.. అర్థంలేని ఆశ.. అడ్రసులు చదవటం పెద్ద అలవాటై కూచుంది.. ప్రమాదంలేని వ్యసనాలు!

కార్డులు తల్లిదండ్రులు వ్రాసేవి — విశేషాలేమీ ఉండవు.

విశేషాలన్నీ—కుర్రతనపు విశేషాలు ఇన్‌లాండ్ లెటర్లలో, కవర్లలో దాక్కుని ఉంటాయి. — రహస్యాలు— స్నేహాలు— సంబంధాలు— వాంఛలు— ప్రేమలు — సినిమాలుచూచీ నవలలుచదివీ తెచ్చిపెట్టుకునే అనవసరపు బెడదలు!

ప్రభావతి ఫస్ట్ బి. ఎస్‌సి. వాళ్ల నాన్న దస్తూరీ— కార్డు—వారానికోసారి బాగా చదువుకొమ్మని వ్రాస్తాడు— గ్రామకరణం దస్తూరీ.

కుమారి జానకి—సెకండ్ బి. ఎస్‌సి—గులాబీరంగు కవరు!

ఇదివరకెన్నడూ ఉత్తరం వచ్చినట్టు లేదు జానక్కి... తల్లిదండ్రులిక్కడే ఉన్నారయ్యే. టైపు చేసిన అడ్రసు...పుస్తకాల కంపెనీ కావచ్చు...ఇంత నాజూకు కవరు ఉపయోగిస్తారా? ఎక్కణ్ణుంచీ?.... పోస్టు ముద్ర?....

ఓహ్ ! సువాసన గుబాళిస్తున్న కవరుగాని మరోటికాదు!

న్యూఢిల్లీ...దూరాభారమే...

జానకి ! పారిజాతప్పువ్వు... ఎర్రరంగు చీరలో స్వచ్ఛంగా, పవిత్రంగా, విప్పారిన తెల్లని సౌందర్య రాశి!...

మహాగంభీరంగా ఉంటుంది— కొత్త పెళ్లికూతురులా ఉంటుంది — ఈ కాలపు పెళ్లికూతురులా కాదు—పాతకాలపు, బిత్తరిచూపుల, సిగ్గుదొంతరల, సౌకుమార్యాల పెళ్లికూతురు—అందరూ ''గుడ్ మార్నింగ్'', 'నమస్తే' అంటారు జానకి మాత్రం అలా అనదు— అసలు పెదవి విప్పదు—మహా అయితే మధురంగా ఎప్పుడన్నా చిరునవ్వు నవ్వుతుంది....

చెలికత్తెల వెనుకనక్కే రాజకుమారిలా వస్తుంది హంసనడకలు నడుస్తూ—ఒంటరిగా ఎప్పుడూరాదు— ఆకాశరాజు కూతురు పద్మావతి లాగ..

వచ్చి నిలుచుంటుంది పుత్తడి బొమ్మ లాగ..

తెచ్చిన పుస్తకం అడిగితేగాని చేతికివ్వదు — తనకు కావలసిన పుస్తకం పేరు చీటీ మీద వ్రాసి తెస్తుంది—నోటితో చెబితే ముత్యాలు రాల్తాయని కాబోలు!.. ఆ నోరు, ఆ చక్కని పెదవులు ఎప్పుడూ ఒక స్నేహితురాలి భుజం వెనకాల దాక్కుంటాయి— మెరుపు చూపులు మాత్రమే మాట్లాడతాయి—

ఈ పరిమళం ఆమెకోసం! ఆమె యీ పరిమళం కోసం!!

అబ్బ!!

అయ్యో!....

ప్రళయం వస్తూన్నట్లు ముసురుపట్టి, సూర్యుడి కాంతి అంతా హరించుకుపోయి,

మృత్యువులాగా, చలి వణికిస్తూ, పాడుగా ఉన్న ఒక ఉదయాన—

పరిమళ పారిజాతం పతనమై పోయిందా!

'టింగ్'—

తొమ్మిదన్నర.

''అయ్యగారూ! జాబులు లెటర్ బోర్డ్‌లో పెట్టిరానా?''

గులాబీ కవరు సొరుగులో పడింది...

''ఆం.. ఇదుగో ఈ కార్డుని గర్ల్సురూమ్‌కి తీసుకు వెళ్ళు.''

స్టూడెంట్స్ వస్తూపోతూ ఉన్నారు. జనసమ్మర్దం ఎక్కువై పోతోంది..

పుస్తకాలిస్తున్నారు, పుచ్చుకుంటున్నారు..

న్యూస్‌పేపర్లు, వారపత్రికలు, మాసపత్రికలు తిరగ వేస్తున్నారు..

ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో గది వేడెక్కిపోతోంది..

లెడ్జర్‌లో ఖాతా పెరుగుతోంది— భూలోకపు పుణ్యపాపాల్తో చిత్రగుప్తుడి చిట్టా కూడా పెరుగుతూనే ఉంటుంది...

లోపల దాగిన రహస్యాలు జీవితాల్ని దహించి వేస్తున్నాయి..

ఎవరో! ఏమిటో కథ!..

అపశ్రుతి, అధర్మం ఆరని జ్వాలగా బ్రతుకుని బూడిద చేస్తూనే ఉంది...

లోకంలో పవిత్రత సౌందర్యం నిలవనీరు—సర్వం మైలపడి నశించాల్సిందే!

ఆశ—చివుళ్ళు తొడిగిన పచ్చని చెట్టుని మొదలంట నరికేశాడు కిచ్చూ—దాన్నే బొగ్గుగా—నల్లగా కాల్చేసి పోయింది కమలాక్షి!

కమల—ఎలా పెంచినపిల్ల, నిప్పులాంటిది, ఎలాచేసి, పోయిందీ!

అటాప్సీ.. అవమానం..

కాష్ఠం.. బూడిద..

అంతే!

''టింగ్..టింగ్..టింగ్..టింగ్....''

పదిగంటలు. అందరూ వెళ్ళిపోయారు-వెళ్ళిపోయారు— నిర్మానుష్యం—నిర్విశేషం.

ఏం మిగిలిందనీ, ఎవరున్నారనీ, యింకా జీవించటం? ఉద్యోగం.. ధర్మం—ధర్మం తప్పదు కదా!

శ్రీనివాసుడు..వేంకటేశుడు..

శాంతి..ప్రశాంతి.. శరణాగతి..

''గరుడయ్యా!''

''స్వామీ!''

''ఈ పుస్తకాలన్నీ తీసుకెళ్ళి సర్దెయ్.''

''మద్దానం అన్నీ ఓమాటే పెట్టేస్తానండి''

''బద్ధకమా? ఎప్పటి పని అప్పుడు చేసెయ్యాలి.''

గరుడయ్య లోపలికి వెళ్ళిపోయాడు. అరగంటయివతలికి రాడు...

అబ్బ!

ఎవరూ లేరు...

కవరు ఉంది...

అవును...

వేశ్యకూతురిలా సువాసనలు గుబాళిస్తోంది!...

నిస్సహాయంగాఉంది—దీనంగా ఉంది..జానకి!జా..న..కి!!

మిటారిసిగ్గునటిస్తోంది—తననితాను దాచుకుంటోంది.

పెదవులు బిగబట్టినట్లు..అదంతా కులుకే!..కులట కవ్వింపే!..

ఆడదాన్ని నమ్మరాదని ఊరికే అన్నారా?..

ఆడది భోగవస్తువు...

జానకి అందం పెళ్లయ్యే దాకా ఆగలేదు!

స్వాతంత్ర్యం— స్వయంనిర్ణయం— ఏం కాలం మహా ప్రభో!

అవినీతి, అధర్మం, సిగ్గుమాలినతనం — దీన్ని అరికట్టాలి!..

నాశనం చేయాలి!..భగ్నం చేయాలి!..

చిరిగింది కవరు గులాబీ!.. చిరిగింది!

భగ్నమైందీ కన్యాత్వం ! ... బయటపడిందీ రహస్యం!..

నల్లగలువలాంటి నీలికాగితపు లేఖ!—ఆహా!

"డార్లింగ్ జానీ!..."

ఏమిటా పిలుపు? పెంపుడు కుక్కని పిలిచినట్లు!...

ఛీ ఛీ...

"డార్లింగ్ జానీ!

నువ్వింత బేలవు, పిరికిదానివి అనుకోలేదు. నిన్నెలా మరచిపోతాననుకున్నావు?.. నేను ఉత్తరం వ్రాయకపోవటానికి కారణం—ఆ మాత్రం ఊహించ లేవూ! ఆ నాడు వక్షాన్ని వక్షంతో అదుముతూ, ఈ రెండు హృదయాల స్పందనమూ రహస్యమూ ఒక్కటేనని నాకు బుద్ధిచెప్పిన దానివి, నీయింటి అడ్రసుకు నేను ఉత్తరం వ్రాయరాదని ఆంక్ష పెట్టిన దానివీ నువ్వే, రెండునెలలు కాలేదే, యిలా కోప్పడుతూ, నామీద దోషారోపణ చేస్తూ వ్రాయడం ఎందుకో!...

నన్ను గూర్చి మా బంధువులెవరో చెప్పిన ఆ సంగతేమిటో చెప్పకుండానే నన్ను నిందిస్తూ సంజాయిషీ అడిగితే నేనేం వ్రాయగలను? నీ చదువు పూర్తికావాలనీ, నా ఉద్యోగానికి ఒకచోటు అంటూ కాస్త నిలకడ ఏర్పడాలనీ కదా అనుకున్నాము. ఆ మాటకు భిన్నంగా జరుగుతుందని ఇంతలో నువ్వెందుకూ అనుకోవడం?....

నువ్వు వ్రాసిన ఆ చివరి వాక్యాలు నాకు ఆందోళన కలిగిస్తున్నాయి సుమా! నీకు జీవితం మీద అంత విరక్తి ఎందుకు కలుగుతూ ఉందో యింత దూరం నుంచీ ఊహించుకోలేని నా అశక్తతని క్షమిస్తావా!.. ఉత్తరం కాలేజికి వ్రాయమన్నావు, వెంటనే వ్రాస్తున్నాను. ఈ భాగ్యానికి పదిహేను రోజులు గడువెందుకు? "వ్రాయకపోతే మళ్లీ కనిపించను" అంటావే ఏమిటా సందేహం నీకు! నీ ధోరణి నాకు చాల భయం కలిగిస్తోంది జానీ! ఎదురుగా ఉంటే 'ఎదలో ఎదనై' నీవేనేనై, ఎలానో నచ్చజెప్పుకునే వాణ్ణి. ఇప్పుడు నీ హృదయాన్ని నువ్వే అనునయించు కోవాలి మరి! వెంటనే సమాధానం వ్రాస్తావు కదూ!

నీ

రామం.

వక్షాన్ని వక్షంతో అదుముతూ బుద్ధులు చెప్పిం దట! ఔరా తెంపరితనం! మళ్లీ చూడటానికి నంగనాచిలా ఉంటుంది.. ంత బూటకపు పిగ్గ!.. ఎవరి కళ్ల కన్నపిస్తే ఏమైపోతానో అనేంత పతివ్రత వేషాలు పైకి చూస్తే!..

అయ్యా, స్త్రీని నమ్మి బాగుపడిన వాడెవడు?..

ఈ వయసుకే—తల్లీదండ్రీ, భయమూ భక్తీ, సంఘమూ దేవుడూ ఏమైనా వుంటేనా! కామం కళ్లకు కప్పితే ఏమైనాసరే-ఎదలో ఎదనై!- అహ!- ఏం మాట!—ఎన్నిసార్లయిందో అలా ఎదలో ఎద! నీవేనేను!

* * *

"'రెబెకా'?... ఆ నవల ఎవరో తీసుకు వెళ్లి నట్టు జ్ఞాపకమోయ్!.. ఉండు చూస్తాను..

అవును.. అది ఒక బి. ఎస్సి. అమ్మాయి దగ్గరుంది... ఓవర్ డ్యూ....

..గరుడయ్యా!"

"ఏం సామీ?"

"బి. ఎస్సి. జానకి, ఈమధ్య 'రెబెకా' పుస్తకం రిటర్న్ చెయ్యలేదూ?"

"ఏమో సామీ!"

"మేష్టారూ! ఇంకేం జానకండీ! మీరింకా వినలేదా? పెద్దగొడవగా ఉంది. ఆయమ్మాయి రాత్రి విషం త్రాగి చనిపోయింది!—పోలీసులూ, జనం, హడా వుడిగా ఉంది, దొడ్డాపురం వీధిలో—మేము వెళ్లాం.. వాళ్లెవర్నీ లోపలికి రానివ్వడంలేదు—ఇవ్వాళ కాలేజికి సెలవు కూడా యిస్తారనుకుంటున్నారు."

"విషం తాగిందా?.. ఎందుకేమిటి?"

ఎందుకేమిటి? క్షానిపనులు చేస్తే—కమలాక్షి దారే జానకీ చూసుకుంది..

"కారణం ఏమీ లేదండీ.. మంచి గర్ల్నండి.. కాలేజిలో అంత మాడెస్ట్ ఎవరూ లేరండి.. వాళ్ల నాన్న ఏదో కోప్పడ్డారనీ.. ఇంటి గొడవలు.."

"ఆమాత్రానికే ఎవరైనా చచ్చిపోతారా! ఏం విపరీతపు కాలం!"

"ఏం చెబుతామండి! కొంతమంది మరీ సెన్సిటివ్..."

సెన్సిటివ్! సెన్స్‌లెస్!! కమలాక్షి, జానకి...

అంతా ఒకటే కథ!..

ఇదుగో, నోటీసు రానేవచ్చింది....

సంతాప సమావేశం.. వెంటనే, గంట కొట్టగానే అందరూ చేరాలి.. తర్వాత సెలవు...

రెండు నిమిషాలు మౌనం అందరూ..

జానకి ఆత్మకు శాంతట! ఇలా అర్ధాంతరపు చావులు చచ్చేవారికి శాంతి ఎలా వస్తుందీ?

అందరూ వెళ్తున్నారు—వెళ్లిపోతున్నారు నిర్మానుష్యం.

*　　*　　*

శ్రియఃపతే! శ్రియఃపతే!!

జానకి ఎందుకు తాగిందో విషం!

అటాప్సీలో ఏమీ తేలలేదుట— కమలాక్షిలా చావలేదు జానకి!!..

మరేమిటి కారణం? ఎందుకు చచ్చిందీ?..

కేవలం ఆ ఉత్తరం వ్రాసిన వాడు రాలేదనేనా?!.. వస్తానని వ్రాశాడుగా ప్రేమని ఒలకబోస్తూ...అంతలో తొందరా!..

ఏదీ ఆ ఉత్తరం?

"..నీకు జీవితం మీద అంత విరక్తి ఎందుకు కలుగుతూ ఉందో ఊహించుకోలేని నా అశక్తతని క్షమిస్తావా!.." అశక్తతట! ఏడిశాడు!

"..ఉత్తరం కాలేజికి వ్రాయమన్నావు. వెంటనే వ్రాస్తున్నాను, ఈ భాగ్యానికి పదిహేను రోజులు గడు వెందుకూ?".. గడువా! గడువు పెట్టిందన్నమాట!.. హరిహరీ! ఉత్తరం అందకపోవటమే కారణమా? చావుకి!

"వ్రాయకపోతే మళ్ళీ కనిపించను.."

మూడో తేదీ ఉత్తరం వ్రాశాడు.. ఇవ్వాళ ఇరవై.. బెదరింపుకాదు, గట్టి నిర్ణయమే!

నిర్ణయం ప్రకారం చేసేసిందీ?..

ఉత్తరం రాలేదనే విషం తాగిందీ?..

ఉత్తరం రాకపోతే ఆత్మహత్య!..

ఉత్తరం వచ్చింది.

జానక్కి.. ఎదురు చూస్తున్న జానక్కి అందలేదు!... చచ్చిపోతామని బెదరించే ఆడవాళ్ళ లోకంలో ఎక్కడైనా ఎవరైనా ఎప్పుడైనా చచ్చారా?.. ఇదొక్కటి తప్పు!.. ఛస్తుందని ఎలా అనుకోను!..

కాని చచ్చిపోయింది!...

ఎందుకు?..

నువ్వు ఉత్తరం దాచావు కాబట్టి!..

ఎందుకు దాచాను? దాని శ్రేయస్సు కోసం దాచాను—ఆ ఉత్తరం మరొకరి చేతిలో పడితే ఎంత అప్రతిష్ఠ అని దాచాను!—అధర్మాన్ని అరికట్టాలని దాచాను!.. ఉత్తరం ఎవరి చేతిలో పడ్డదీ? నీ చేతిలో నేగా! నువ్వు మాత్రం మరొకరుకాదా!—నీవల్ల 'అప్రతిష్ఠ' కాదు హత్యే జరిగింది!—ఉత్తరం అందితే జానకి బతికేది!—అన్ని అధర్మాలనూ నువ్వు అరికట్టుతున్నావా?—ఏదో చెయ్యబోయి హత్య చేశావు!. ఇది హత్య ఎలా అవుతుందీ? ఒళ్ళు పొగరెక్కి, మద పిచ్చిలో మతి చలించి, పాపంపండి, కన్యాత్వం చెడి, అది చచ్చింది.. ఛస్తే చచ్చింది!..చావొచ్చి చచ్చింది!.. కాదు! ఎదుగుతున్న మొక్కని, అల్లుకుంటున్న తీగని, క్రూరంగా, రాక్షసంగా, కత్తిరించి వేశావు—నువ్వే సైంధవుడిలా అడ్డుపడకపోతే దాని ప్రేమ ఫలించేది!...

వివాహం జరిగేది...ఆనందంతో, ఆ పారిజాతం, పరిమళించేది!...

శ్రియఃపతే! ఈ పాపం, ఈ నింద నాతలకు చుట్టుకుందా?..

పాపం! నింద!.. నీకు ప్రేమ లేదు, నీకు ప్రేమ తెలీదు!..

ఏమిటి 'సినిమా ప్రేమ'? ఎందుకు తెలీదు, బాగా తెలుసు!!..

సినిమా ప్రేమ—చౌకబారుగానే ఉండవచ్చు—కాని జానక్కి—కమలాక్షికి—వాళ్ల అమాయక హృదయాలకి—అదే పరమార్థంగా కనిపిస్తుందేమో! దానికోసమే వాళ్లు ప్రాణత్యాగం చేశారు!...

చేశారు! ఆత్మహత్య మహాపాతకం! ధర్మం విలువ తెలిసి అజ్ఞానంలో ఏమైనా చేస్తారు? నరకానికి పోతారు!....

ఆత్మహత్య ఎలా అవుతుంది? జానకి విషయంలో హత్యకు కారకుడివి నువ్వు!..

శ్రియఃపతే! శరణాగతుణ్ణి. వృద్ధుణ్ణి, ధర్మం కోసం, అన్నిమమతలూ వదలుకొన్నవాణ్ణి, నే నెందుకు చేస్తాను హత్య? ఎందుకు పెట్టావయ్యా ఈ పరీక్ష నాకు!!....

పరీక్షకాదు, స్త్రీ హత్యాపాతకం! ఒక్కసారి చూడు: నీ నీడ సోకిన చోట, ఎక్కడైనా, పచ్చదనం నిలిచిందేమో! భార్యను మింగావు, కొడుకుని తరిమే శావు, కూతుర్ని పెళ్లి చెయ్యకుండ పొట్టను పెట్టుకున్నావు, నీపాడు కళ్లు పడ్డాయో లేదో, పారిజాతంలాంటి చిన్నది, వాడి, వగ్గై, నేలమట్టమై పోయింది! ఇక సంతోషించు!...

వేంకటేశా! స్వామీ!ఈ బాధ్యత,ఈపాపం, నాదికాదు!..

మరెవరిది?...

మా యింటావంటా లేదు!...

నిజంగానే? ఆలోచించు!..

మా నాన్న భక్తుడు— రామాలయంలో అర్చకుడు... అతనికి గొల్ల వీరమ్మతో ఉండేది కాదూ?..

అని, ఎవరో, అన్నారు; కిట్టనిమాటలు, నాకు తెలీదు! అది నిజమై ఉండదు!..

నువ్వు, దాని కూతురు, సుబ్బులు కోసం ఎగబడలా?...

నాకు పసితనం, యిదమిత్థమని ఊహ తెలీని వయసు, అమాయకత్వం.. అందుకేనా నాన్న మంద లింపు!—"తక్కువ జాతి వాళ్లతో ఏమిట్రా?"..

సుబ్బులు, పారిజాతాలు తెచ్చేది, పూజకోసం.. అది వయసులో, నా కంటె రెండుమూడేళ్లు, పెద్దది, అవును, దాన్ని పట్టుకుని వేళ్లాడాలనీ, ముద్దెట్టుకోవాలనీ అనిపించేది కాదూ!.. దానితో దాగుడుమూతలు ఆడేవాణ్ణి.. కుర్రతనం.. దాని జాతి తక్కువ!.. కాదుమరీ! ఆడవాళ్లే మగవాళ్ల కంటె తక్కువ! అందుకేనా అమ్మ మాట ఎన్నడూ వినలేదు?..

అమ్మ మంచిది—వినకున్నా ఏమీ చెయ్యదు—
నాన్న చండశాసనుడు చర్మం ఒలిచేస్తాడు..

నాన్నకు భయపడేనా, సుబ్బుల్ని ఏమీ చెయ్య లేదు?...

కాదు, కాదు, నేను పాపం చెయ్యను, చెయ్యలేను,

చేతకాదు! నేను పాపం చెయ్యలేదు!!

చేతగానితనం!..

ఏమైతేనేం, నేను పాపం చెయ్యలేదు, వేంకటేశా! నేను చెయ్యలేదు!...

నువ్వు కమలాక్షి పెళ్లికి అడ్డుపడలేదూ?...

అది వర్ణాంతర వివాహం-ఎలా సమ్మతించేది?-
కమలాక్షి రహస్యంగా, హద్దుమీరి ప్రవర్తించి గర్భం తెచ్చుకుని,తన అవమానంతో,తనే మసై పోయింది...

నువ్వు జానకి ఉత్తరం దాచలేదూ?...

అందులో జానకి ప్రాణాలున్నాయని నాకేం తెలుసు? ఎలా అనుకోను! కేవలం దుర్విధి!...

నువ్వు!—నీకు!-వాళ్లమీద ఏమిటి హక్కు?-ఏమిటి నీ జోక్యం?..

హక్కు? అధికారం? ఉందని నేనన్నానా? ధర్మం, ధర్మం తప్పదుకదా అని చేశాను— అంతే!....

జీవితాల్ని నాశనం చేసి, ప్రాణాలు తీసే పనులు, ధర్మమా?....

నేను—నేను—కేవలం నిమిత్తమాత్రుణ్ణి!..

తప్పించుకో జూస్తున్నావా?...

లేదు!..

లేదు!-ఎక్కడికి పోతావు?-ఎక్కడికిపోతాను-!

స్వామి దగ్గరకు—ఈ లోకం పుణ్యపాపాలో నాకేంపని!వెళ్తాను స్వామి దగ్గరకు—ఆయనదే తీర్పు—ఆయనదే భారం—

* * *

"గరుడయ్యా! కొండ పైకి వెళ్ళాలోయ్"

"టికెట్లు తెమ్మంటారా స్వామీ?"

"బస్సు మీద కాదోయ్. నడిచి వెళ్దామని ఉంది."

"ఆయాసం స్వామీ! ఈ వయసులో మీవల్ల అవుతుందా?"

"వయసుకీ ఆత్మకీ సంబంధం లేదోయ్."

"శరీరమేగదండి ఎక్కేది"

"ఆత్మ గొప్పదా శరీరం గొప్పదా?"

"ఏమో అవన్నీ నాకేం తెలుసండి!"

"నువ్వు ఎక్కగలవా లేదా?"

"ఇప్పుడెవ రెక్కుతున్నారండీ!.. అలవాటు పోయిందండి.. నాకూ బస్సే మేలనుకోండి.. మీరు రమ్మంటే వస్తాను.. మద్దె మద్దె కూచుంటూపోతే ఎక్కిపోవచ్చులెండి.. అయితే సల్లపొద్దున బయల్దేరా లండి.."

"ఈ శనివారం సాయంకాలం వెళ్దాం.. మరచి పోవద్దు.."

* * *

వికలాంగులు.. కుష్ఠువాళ్ళు..

గ్రుడ్డివాళ్ళు.. అనాథులు..

భిక్షాటనమే వృత్తి చేసుకున్న సంసారాలు...

ఎగుడి దిగుళ్ళు...

రాళ్ళు.. చెట్లు చేమలు.. ఆకాశం..

అబ్బ! ఆయాసం!...

అబ్బ! నీరసం!...

మెట్లు.. పైకి, పైపైకి మెట్లు..

పైన ఆకాశం.. మబ్బులు..

చీకటిపడింది.. చల్లని వర్షపుగాలి..

"గరుడయ్యా! టైమెంతైంది."

కొత్త వాచీ వైపు—ఎంత ధీమాగా ఎంత గర్వంగా—ఎంతసేపు—చూస్తున్నాడు!

"సీకట్లో సరిగా కనిపిస్తే గదండి!..ఎనిమిదింబావు!.. ఇంకెంత!.. వచ్చేశాం సామీ"

చినుకులు.. వర్షం..

"రామానుజాచార్యుల యింటికి వెళ్ళి విశ్రమిస్తాను నువ్వు 'సుప్రభాతం' వేళకు దేవాలయం దగ్గర ఉండవోయ్."

* * *

"కమలా కుచచూచుక కుంకుమ.."

ఈ వర్షం తగ్గదు.. అబ్బ! వణుకు!..

జారుతోంది.. కాళ్ళు తడబడుతున్నాయి.. ఎంత నీరసంగా వుంది! రామానుజంలేడు సమయానికి... వీడు గరుడయ్య ఎక్కడ పడి నిద్రపోయాడో ఏమో... పోనీ తిరువెంగళం కనిపించినా బావుణ్ణు.. కాస్త సాయం... లోపలికి వెళ్ళేందుకు...

వాడి కృప ఉంటే అన్నీ సమకూరుతాయి— లేకపోతే ఏమీలేదు.

అబ్బ!..అయ్యో!!....

* * *

ఎక్కడ?....

ఏమిటీ పడక?.. ఏదీ దేవాలయం?..

పడ్డాను.. అయ్యో! పడ్డాను.. కుడికాలు...విరిగింది కాబోలు ..నొప్పి... అబ్బ! కదల్లేను..భగవాన్— ఇది ఆస్పత్రిలా వుంది—దేవాలయం కాదు!—ఆస్పత్రికి వచ్చాను!— లోనికి— దేవాలయంలోనికి— వెళ్ళలేదు!

"పాలు తీసుకోండి"

ఎంత మెలకువగా పాలు త్రాగిస్తోంది.. అబ్బ! ప్రాణం లేచివస్తోంది...నొప్పి!...బాధ!...

"ఎవరమ్మా మీరు? డాక్టరా?"

"అవును... ఇక్కడ కాదు..."

ఇంగ్లీషులో మాట్లాడుతోంది... ఈ వైపు కాదు... ఉత్తరదేశం...

"ఎక్కడ?"

"మాది బొంబాయి... మీరు కొండమీద దేవాలయం దగ్గర పడిపోయారు...మేము వెనకాలే వస్తున్నాము... మీకు తోడు ఎవరూలేరు. మీబంధువు లెవరో తెలీదు...మీకు పూర్తి స్పృహలేదు...కుడికాలు జాయింట్ ఫ్రాక్చర్ అయింది...మా కారుమీద వెంటనే యిక్కడకు తీసుకువచ్చాము...వచ్చాక తెలిసింది

మీరిక్కడ కాలేజిలో లైబ్రేరియన్ అని... ఎందుకండీ, కన్నీళ్లు పెడుతున్నారు? బాధగా వుందా?..."

"మీరు దేవాలయంలోకి వెళ్లారా?"

"లేదు. మీతోబాటే వెళ్లబోతున్నాము. అంతలో మీరు పడిపోయారు. మిమ్మల్ని అలా వదలి ఎలా వెళ్లేది?...యిప్పుడు వెళ్లవచ్చు."

"బొంబాయిలో ఎవరో జడ్జి రోడ్డు మీద పడిపోతే ఎవరూ పట్టించుకోలేదని విన్నానే."

"అందరూ అలా బాధ్యత లేకుండా ఉంటారాండీ!"

నవ్వుతోంది ... స్వచ్ఛంగా — పవిత్రంగా — నవ్వుతోంది.. పుణ్యాత్మురాలు..

"మీ పేరేమిటమ్మా?"

"ప్రేమ"

"అంటే? పూర్తి పేరు?"

"ప్రేమానాంచారి... బాలాజీ మాకు యింటి దేవుడు."

"నాంచారి!.. మా అమ్మ పేరూ నాంచారమ్మే.. మీరు బ్రాహ్మలా?"

"కాదు"

"మీ కులం?"

చిరునవ్వు నవ్వుతూ సందేహిస్తోంది..

"హరిజనులు"

హరేరామ! శ్రియఃపతే!..ఎందుకీ కొస ఊపిరి? ఎందుకీ శిక్ష?..

"మీరు విశ్రమించండి"

* * *

"అప్పా..అప్పా..అప్పా"

"ఊ... ఊ..."

"అప్పా..నేను కిచ్చాని..యిట్లా చూడు"

"ఎవరు! అబ్బ!...కిచ్చా?.. క్రిష్టస్వామి?..నువ్వు.. నువ్వు ఎప్పుడు ఎట్లా వచ్చావు?"

"రామానుజాచారి వైర్ ఇచ్చారు"

"ఎందుకు?"

"ఎందుకేమి? మీకు ఆక్సిడెంట్ అయిందని"

"కిచ్చా... అవును..కిచ్చా.. నాపని అయిపోయింది."

"ఎందుకప్పా కన్నీళ్లు?..నీకు నయమౌతుంది.. వంట్లో శక్తి రాగానే బొంబాయి వెళ్లిపోదాం."

"వద్దు...ఈ దేహం యిక పనికిరాదు... స్వామి నన్ను కొండకు రమ్మన్నాడు.. ఎక్కడానికి యింకో దేహం కావాలి.. కిచ్చా! నాయనా!.. ఈ దేహానికి అగ్నిసంస్కారం చెయ్యటానికి వచ్చావు.. చేసి పో, నాయనా!.. ధర్మం తప్పదు కదా!"

---

